# భూమయ్యకి బుద్ధొచ్చింది

-వాణిశ్రీ

హాస్పిటల్ సూపరింటెండెంట్ ఆఫీసు నుంచి కదిలేదాకా భూమయ్యకు డ్యూటీ తప్పదు. ఆయన వార్డుల్లో రౌండ్లేసి తిరిగ్గా ఆఫీసుకొస్తాడు. అప్పుడు ఫైల్స్ విప్పతాడు. ఆఫీసు స్టాఫ్‌ని పిలిచి మాట్లాడుతుంటాడు. సంతకాల కార్యక్రమం పూర్తయ్యేసరికి రాత్రి ఎనిమిది దాటుతుంది.

ఈ లోపలే వార్డ్‌బోయ్ కేశవులు భూమయ్య కోసం ఆఫీసు ముందు తచ్చాడుతుంటాడు. భూమయ్య కొంచెం ఆగమని సైగలు చేస్తాడు. ఆఫీసు అటెండర్‌కి సూపరింటెండెంట్ కదిలేదాకా డ్యూటీనే. పోర్టికోలో సూపరింటెండెంట్ కారు కదిలాక భూమయ్య ఊపిరి పీల్చుకుంటాడు.

"జిడ్డురా బాబూ ఈ సూపరింటెండెంట్. ఏ ఫైల్ మీదా వెంటనే సంతకం పెట్టడు. అన్నీ డౌట్లే. ఒక్కొక్కళ్ళనీ పిలిచి వాయిస్తుంటాడు'' అన్నాడు భూమయ్య విసుగ్గా.

"ఎవరైనా గుడ్డిగా ఎందుకు సంతకాలు పెడతారు? ఎందులోనైనా ఇరుక్కుంటామని భయం ఉంటుంది ఆఫీసర్స్‌కి'' అన్నాడు వార్డ్‌బోయ్ కేశవులు.

"ఇంతకుముందున్న సూపరింటెండెంట్ అక్బర్ ఐదు నిముషాల్లో సంతకాలన్నీ పెట్టేసేవాడు. పొట్టి సంతకమా? పొడుగు సంతకమా అని మాత్రం అడిగేవాడు అంతే'' అన్నాడు భూమయ్య.

"ఆయనా? గుండెలు తీసిన బంటు అంటారు. నన్నెవడేం చేస్తాడ్లే అని ధీమా? మంత్రిగారి అల్లుడు మరి. ఏదైనా కేసులైనా మాఫీ చేయిస్తాడు. అందరికీ అట్లాంటటి మావలుండొద్దూ'' అని పక పక నవ్వాడు కేశవులు.

ఆరోజుకి ఇద్దరి సంపాదనా బైటికి తీశారు.

"చ్చ్...చ్చ్... హాఫ్ బాటిల్ గూడా రాదుగా?'' అని పెదవి విరిచాడు భూమయ్య.

"జార్జి ఈరోజు కూడా డ్యూటీకి రాలేదు? వాడొస్తే బ్రాందీషాపులో ఖాతా రాయిస్తాడు. ఫుల్ తెచ్చేవాడు. ముగ్గురికీ హేపీగా ఉండేది'' అన్నాడు కేశవులు.

"వాడికేం పెళ్ళాం సంపాదిస్తుంది'' అని అసూయ వ్యక్తంచేశాడు భూమయ్య.

కేశవులు బ్రాందీషాపు వాడిని బ్రతిమాలి కొంత అప్పు పెట్టగలిగాడు. బాటిల్ తీసుకుని మళ్ళీ హాస్పిటల్లోకి వెళ్లారు. కిచెన్‌లో కూల్డ్‌వాటర్ బాటిల్, గ్లాసులు తీసుకుని ఖాళీగా ఉన్న స్పెషల్ రూమ్‌లో దూరారు. అదివాళ్లకి మామూలే. రూములు ఖాళీ లేకపోతే మేడపైకి వెళ్లిపోతారు. లేదా కారు షెడ్లలో దూరతారు. నిషా తలకెక్కి బాటిల్ ఖాళీ అయ్యాక రాత్రి ఏ పదింటికో ఇంటికి బయల్దేరతారు. నైట్ డ్యూటీ కొచ్చినవాళ్ళు వీళ్లతో చేరి మరికొన్ని బాటిల్స్ తెస్తే ఇక ఇంటికి వెళ్లే పని లేదు. ఎక్కడివాళ్లక్కడ వళ్ళు తెలియకుండా పడిపోవడమే. తెల్లవారిన తర్వాత ఊడవడానికి స్వీపర్లు బూతులు తిట్టి లేపితే లేవడమే.

భూమయ్య, కేశవులు తాగుతూ కూర్చున్నారు.

"పాపం జార్జికి వంట్లో బాగాలేదు'' అన్నాడు కేశవులు.

"జ్వరమా?'' అడిగాడు భూమయ్య.

"జ్వరమే కానీ తగ్గడం లేదు. నాకైతే వాడికి ఎయిడ్స్ వచ్చిందని అనుమానం''

భూమయ్య అదిరిపడ్డాడు.

"జార్జి అటువంటివాడు కాదే?'' అన్నాడు.

"జార్జికాదు, వాడిపెళ్లాం అటువంటిదే'' చెప్పాడు కేశవులు.

"అదేంటి వీనస్ బాగానే ఉందిగా! ఈరోజు కూడా డ్యూటీకి వచ్చింది. అసలు వీనస్ తిరుగుబోతంటావా?''

కేశవులు నవ్వాడు.

"నువ్వు ఆఫీసులో ఛస్తావు కాబట్టి హాస్పిటల్లో జరిగే యవ్వారాలు తెలిసి చావవు. వీనస్ లాడ్జీలకు కూడా పోతుంది. దానికోసం కొందరు హాస్పిటల్‌కి కూడా వస్తుంటారు. జార్జి సంపాదన తాగుడికే సరి. మరి వీనస్ దర్జాగా ఎట్లా ఉంటున్నది? ఇల్లెలా గడుపుతున్నది అనుకుంటున్నావ్?''

కేశవులు చెప్పేదంతా ఆశ్చర్యంగా వింటున్నాడు భూమయ్య. కేశవులు తాగి తంతుంటే అతని భార్య తట్టుకోలేక కాల్చుకుని చచ్చిపోయింది. పిల్లల్ని అతన భార్య పుట్టింటివాళ్ళు తీసుకెళ్ళి పెంచుతున్నారు. అప్పట్నుంచి కేశవులు శాడిస్టులా తయారయ్యాడు. సుఖంగా సంసారాలు చేసుకుంటున్న భార్యభర్తల్ని చూస్తే కళ్లల్లో నిప్పులు పోసుకుంటాడు. అసత్య ప్రచారాలు చేస్తుంటాడు. అది వాడికి ఆనందం.

"అది సరే ఎయిడ్స్ వస్తే ముందు వీనస్‌కి రావాలి. అది బాగానే ఉంది. జార్జికి ఎట్లా వస్తుంది?'' అడిగాడు భూమయ్య.

"నువ్వొక పిచ్చాడివి! వీనస్ బలం మీద ఉంది. అది లాడ్జీల్లో బిర్యానీలు, మాంసం బాగా తింటుంది. జార్జికేముంది? తిండా పాడా? మందు తాగి ఆవకాయ నాలిక్కి రాసుకుంటే ఏం బలం? వాడి దగ్గర బలమేం ఉంది. అందుకని జబ్బు బైట పడి ఉంటుంది''తనొక పెద్ద డాక్టర్‌లా కోశాడు కేశవులు.

* * *

భూమయ్యకి ఆరోజు ఎంత తాగినా ఎక్కలేదు. ఆలోచనలు బుర్రను తొలిచేస్తున్నాయి. వీనస్, జార్జిల గురించి కేశవులు చెప్పిన మాటలు చెవుల్లో మోగుతున్నాయి. కొంపదీసి తన పెళ్ళాం సుందరి గూడా లాడ్జీలకు పోయి డబ్బు సంపాదిస్తున్నదా ఏం? అనే అనుమానం మొదలైంది. తను ముందు సరదాగా అప్పుడప్పుడూ తోటి అటెండర్‌తోను, వార్డు బోయ్‌ల తోను తాగేవాడు. హాస్పిటల్లో వచ్చే పైపై డబ్బుల్తో తాగేవాడు. అట్లా సరదాగా మొదలైన తాగుడు రోజూ మామూలైపోయింది. చీకటిపడుతూనే నాలిక పీకసాగింది. బుర్ర పనిచెయ్యేదు. డబ్బులు లేనప్పుడు అప్పులు చెయ్యడం జీతం వచ్చినప్పుడు ఇవ్వడం మొదలుపెట్టేవాడు. సుందరి ఇల్లు గడవడం లేదని గొడవపెట్టేది. ఏడ్చి మొత్తుకునేది. తను తన్ని బూతులు తిట్టేవాడు. ఇక అలవాటైపోయింది. ఇప్పుడు సుందరి ఏం అనడం లేదు. ఇల్లు మామూలుగానే గడిచిపోతోంది. కొత్త కొత్త సామాన్లు, ఫర్నిచర్ ఇంట్లోకి వస్తున్నాయ్.

ఎలా? భూమయ్య గుండె గుభేలుమంది. సుందరి గూడా అట్లా సంపాదిస్తున్నదా? తను గూడా ఎయిడ్స్ తగిలి ఛస్తాడా? అతనికి వణుకు పుట్టింది. సుందరిని ముట్టుకోవడం మానేశాడు.

సుందరి అతణ్ణి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇదివరకటికన్నా మంచి మంచి చీరలు కడుతోంది. మనిషి కూడా రోజురోజుకీ నిగనిగలాడుతోంది.

కేశవులు చెప్పే మాటలు గుర్తొచ్చి భూమయ్య లోలోపల భయపడిపోసాగాడు. సుందరి ఎక్కడ కనిపించిందీ, ఇక్కడ కనిపించింది, ఎవడితోనో సినిమా హాలు దగ్గర మాట్లాడుతున్నదీ అని చెప్తుండేవాడు. ఒకరోజు సుందరి మీద తనకు డౌటుగా ఉందని కేశవుల్తో అన్నాడు భూమయ్య.

"అటువంటిది ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే" అని ఛీత్కరించాడు కేశవులు.

"అదెక్కడన్నా ఎయిడ్స్ తగిలించుకొచ్చిందనుకో ముందు నీకే అంటుకుంటది. దిక్కులేని చావు ఛస్తావ్? దాన్ని పుట్టింటికి తరిమెయ్యి. దర్జాగా ఉండు" అని కేశవులు నూరిపోశాడు.

"మనిషి మాంసం రుచి మరిగిన పులిలాంటిది ఆడది కూడా. ఆ సంపాదనకి అలవాటు పడ్డాక మానుతుందా? రోజులన్నీ మనవి కాదు. ఏదొకరోజు ఆ జబ్బు తగలక తప్పదు. నీకు అంటుకోకా మానదు" అని భూమయ్యని భయపెట్టేడు.

"అసలది ఆ బిజినెస్ చేస్తున్నదో లేదో? చేస్తూంటే పట్టుకోవాలి. తన్ని తగలెయ్యాలి. అప్పుడు మనల్ని ఎవడేం అనలేడు" అన్నాడు భూమయ్య.

"ఒక పనిచెయ్యి. దానికి టెస్ట్ పెట్టు"

"టెస్టా?"

"ఔను. ఇంటికి ఫోన్ చెయ్యి. నీరేటెంత అని అడుగు. చెప్తే ఎక్కడికి రమ్మంటావు? నన్ను రమ్మంటావా? నువ్వు లాడ్జికి వస్తావా? అని అడుగు. బైటపడుతుంది రంగు" సలహా ఇచ్చాడు కేశవులు.

"అది నా గొంతు గుర్తుపడుతుంది. నువ్వే అడుగు" అన్నాడు భూమయ్య.

ఇద్దరూ కలిసి టెలిఫోన్ బూత్‌కి వెళ్లారు. కేశవులు భూమయ్య ఇంటికి రింగ్ చేశాడు. "హాలో..!" అన్నది సుందరి.

"హాలో! సుందరేనా?"

"ఔను మీరెవరు?" అడిగింది సుందరి.



"నీ గురించి ఎవరెస్ట్ లాడ్జి మేనేజర్ చెప్పాడు"

"ఏం చెప్పాడు?"

"మాట్లాడుకుంటే లాడ్జికి వస్తావని"

"ఏం మాట్లాడాలి?"

"అది నీ రేటెంత?"

"వెయ్యి రూపాయిలు"

"అమ్మో! ఎక్కువే!"

"సరే! లాడ్జికి వస్తావా?"

"రాను"

"అదేం?"

"నువ్వే మా ఇంటికి రా!"

"మీ ఆయన ఊళ్లో లేడా?"

"ఉన్నాడు. ఉన్నా లేనట్లే. తాగొచ్చి తెలివిలేకుండా పడుకుని ఉంటాడు. తెల్లారిందాకా లేవడు"

"అదా సంగతి. ఎన్నింటికి రమ్మంటావు?"

"రాత్రి పన్నెండుగంటలకి"

"సరే! అడ్రస్ చెప్పు" సుందరి అడ్రస్ చెప్పింది.

"ఇంటిముందు తలుపుకొట్టొద్దు. ఎవరైనా చూస్తారు. దొడ్డిదారినుంచి రా"

రిసీవర్ పెట్టేసిన కేశవులు భూమయ్య వైపు జాలిగా చూశాడు. భూమయ్య ముఖం కుతకుత ఉడుకుతోంది ఎర్రగా.

"ఏం చేద్దాం?" అడిగాడు కేశవులు.

"ఈ పూట తాగుడొద్దు. నువ్వు మా ఇంటి దొడ్డిదారిన ఇంట్లోకి రా! నేను పట్టుకుంటాను రెడ్‌హేండెడ్‌గా. నువ్వు సందు చూసుకుని పారిపో. దాన్ని తన్ని తగలేస్తాను పీడాపోతుంది" కోపంగా అన్నాడు భూమయ్య.

* * *

అర్ధరాత్రి పన్నెండైంది. భూమయ్యకి నిద్రరావడంలేదు. దొడ్డి తలుపు చప్పుడైంది. సుందరి లేచి వెళ్లింది. భూమయ్య చూస్తూనే ఉన్నాడు. సుందరి వెళ్ళాక తను లేచాడు. కేశవుల్ని లోపలకు తీసుకొచ్చాక ఏం చెయ్యాలో మన సులోనే రిహార్సల్ వేసుకుంటున్నాడు. ఎంతకీ కేశవులు, సుందరి లోపలకు రాలేదు. దొడ్లో ఏదో గోలగోలగా ఉంది. అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. ఎవరో ఎవర్నో తిడుతున్నట్లు తిట్లు వినిపిస్తున్నాయి. భూమయ్య నెమ్మదిగా లేచి దొడ్లోకి తొంగిచూశాడు. కేశవుల్ని స్థంభానికి కట్టేసి ఇష్టం వచ్చినట్లు బాదుతున్నారు పదిమంది ఆడోళ్ళు. కేశవులు లబోదిబోమంటున్నాడు.

"ఎవర్రా నువ్వు? నా గురించి లాడ్జీ ఓడు చెప్పాడా? నువ్వు నా రేటు అడుగుతావా? ఆడోళ్ళు తేరగా ఉన్నార్రా?" సుందరి చీపురుకట్టతో బాదుతోంది.

కథ అడ్డం తిరగడంతో భూమయ్య తల తిరిగింది. దూరం నుంచి ప్రేక్షకుడిలా చూస్తుండిపోయాడు. ఇందులో తన పాత్ర బైటపడితే తనను కూడా కట్టేసి తంతారని భయపడిపోయాడు. "ఏంటి గోల?" కేశవుల్ని చూసి "కేశవులూ ఏంట్రా ఇది?" ఏం తెలియనట్లు అన్నాడు భూమయ్య.

కేశవులేం చెప్తాడు? భూమయ్య వైపు కోపంగా, క్రూరంగా చూశాడు.

"వీడు నీకు తెలుసంటయ్యా?" అడిగింది సుందరి.

"తెలుసు. మా హాస్పిటల్లోనే వార్డ్‌బోయ్! ఏం చేశాడేం? దొంగతనానికి గానీ వచ్చాడా?" అడిగాడు భూమయ్య ఆశ్చర్యం నటిస్తూ.

ఇరుగుపొరుగు ఆడాళ్లంతా కేశవుల్ని తంతూనూ, తిడుతూనూ ఉన్నారు. కేశవులి షేప్‌లు మారిపోతున్నాయి. వాడి నోటి వెంట మాట రావడంలేదు.

"పోలీసుల్ని పిలవండి..."ఎవరో అంటున్నారు.

"వాడు పిచ్చోడు. పాపం వాడి పెళ్లాం కిరసనాయిలు పోసుకుని చచ్చిపోయింది. అప్పట్నుంచి ఇలా తయారయ్యాడు. వదిలేయండి పోతాడు. పోలీసుకేసైతే ఉద్యోగం ఊడుద్ది. ఆ పాపం మనకెందుకు?" అన్నాడు భూమయ్య.

"మామూలు పిచ్చికాదు. మద పిచ్చి అనుకుంటాను" అని మరికాసిని వడ్డించారు. తర్వాత కట్లు విప్పి కేశవుల్ని విసిరి వీధిలో పడేశారు. డస్ట్‌బిన్ పక్కన పడుకున్న కుక్క మీద పడ్డాడు. అదికుయ్యో, మొర్రో అని పరిగెత్తింది. నెమ్మదిగా లేచిన కేశవులు బ్రతుకుజీవుడా అని పరుగులంకించుకున్నాడు.

"నువ్వు రోజూ తాగి తందనాడుతుంటే అందరికీ లోకువయ్యాను. ఇల్లు గడవడానికి నేను ఎన్ని తిప్పలు పడుతున్నానో నీకు తెలుస్తోందా? డ్వాక్రా గ్రూపులో చేరి విస్తరాకులు తయారుచేస్తున్నా కొవ్వొత్తులు, ఫినాయిలు..."

"ఇక చాల్లేవే! నాకు బుద్ధొచ్చిందిగా! ఇక తాగను సరేనా?" అని సుందరిని దగ్గరికి తీసుకున్నాడు భూమయ్య. "చూస్తాగా..." అంది సుందరి.

మర్నాటినుంచి భూమయ్యని చూస్తూనే కేశవులు దెయ్యాన్ని చూసినట్లు హడిలిపోసాగాడు. భూమయ్యకి గూడా కేశవులి శాడిస్ట్ మనస్తత్వం అర్ధమైంది. ఇక జన్మలో తాగుడుజోలికి పోకూడదనుకున్నాడు.

★



## నేనెప్పటికీ స్టూడెంట్‌నే...!

తన పురోభివృద్ధికి కారణాలేంటీ అని ఎవ్వరైనా అడిగితే 'నేను నా సినిమా హిట్టయిపోగానే, ఇంత పారితోషికం ఇస్తేనే నటిస్తాను అని డిమాండ్ చేయను. నటిగా నేను స్టూడెంటే అని అనుకుంటాను. ఎందుకంటే నటనలో నేర్చుకోవాల్సినవి చాలా ఉన్నాయి. ఎవ్వరైనా మంచి సలహా ఇస్తే, ఆ సలహా మంచిది అనిపిస్తే తప్పకుండా పాటిస్తాను. ఇవే నా అభివృద్ధికి కారణాలని అనుకుంటున్నాను' అంటుంది శ్రియ. సూపర్ స్టార్ రజనీకాంత్ సరసన 'శివాజీ' చిత్రంలో నటించడం గొప్ప అదృష్టంగా భావిస్తాను. నా సినీ కెరీర్‌లో ఇదొక మరచిపోలేని సంఘటనగా భావిస్తానంటోంది శ్రియ.

